# పిల్లలూ - పెద్దలూ

స్కెచ్

ఆ రోజు ఎండ తీవ్రంగావుంది. రైలుపెట్టెలో విపరీతమైన ఉక్క. ఇంకో అరగంటదాకా ఏ పెద్దస్టేషనూ రాదు. పది నిముషాలు దిగి ఇటూ అటూ పచారుచెయ్యడానికి. ఆ రైలుపెట్టెలో; ఓ చిన్నపిల్ల, అంతకంటే ఇంకో చిన్నపిల్ల, ఓ చిన్నపిల్లాడు—వాళ్ళ మేనత్తగాబోలు సీటుకి ఓ మూలగా కూర్చునివుంది. ఎదుటి సీటుని ఎవడో బ్రహ్మచారి ఆక్రమించు కూర్చున్నాడు. వాళ్ళ ముక్కూ మొహం తెలియనివాడిలాగే వున్నాడు. న్యాయంగా చెప్పాలంటే పెట్టెనంతా ఆక్రమించుకున్నది-ఆ చిన్న పిల్లలూ—చిన్న పిల్లాడే! ఆ పిల్లలు వేసే ప్రశ్నలకి సమాధానాలు ముభావుగా చెప్తూ అప్పుడప్పుడు వూరుకోమని కూడా చెపుతోంది. కాని ఆ పిల్లలు ప్రశ్నలు కురిపిస్తూనే వున్నారు. సాధారణంగా అత్త సమాధానాలు "వద్దనీ" "అలాకాదనీ" ముగుస్తూంటే, పిల్లల ప్రశ్నలు "ఎందుకు?" అనే మొదలెడుతున్నాయి. బ్రహ్మచారి చాలా అనుకున్నాడు—కాని పైకి ఏమీ అనలేదు.

"తప్పు పాపా అలాచెయ్యకు" అని వ్యర్థంగా అరిచింది ఆవిడ. ఆ పాప-రైలుపెట్టెలో సీట్లని గుద్దుతోంది. ప్రతీ దెబ్బకీ ఓ దుమ్ముమేఘం లేస్తోంది. "ఇలా వచ్చి కిటికీలోంచి పైకిచూడు చక్కగా" ఆవిడ తిరిగి అంది. ఇష్టంలేనట్లే ఆ పిల్లా మిగతావాళ్ళూ కూడా కిటికీదగ్గర చేరారు.

"ఆ మేకలమందని పొలంలోంచి యెందుకు తోలేస్తున్నారత్తా?" అటు చూసీచూడగానే కనిపించిన దృశ్యంమీద మొదటి ప్రశ్న.

"ఇంకా బాగా గడ్డివున్న పొలానికి తోలుకుపోతున్నాడేమో!"

"ఆ పొలంలోనూ చాలా గడ్డే వుందేమరి" అడ్డుప్రశ్న వేశాడు పిల్లాడు. "ఆ పొలంలో గడ్డి తప్ప ఇంకేంలేదే!" అన్నాడు.

"ఇంకో పొలంలో గడ్డి యింతకంటె బాగుంటుందేమో, తోలుకుపోతున్నాడు" విసుగ్గా అంది మేనత్త.

"ఇంతకంటె అక్కడ ఎందుకుబాగుంటుంది?" తక్షణం తప్పనిసరిగా రావలసినప్రశ్న రానే వచ్చింది.

"అదిగో—ఆ ఆవుల్ని చూడండి" ఆత్రంగా అంది ఆమె. రైలు దారిప్రక్క ప్రతి పొలంలోనూ, ఆవులూ, ఎడ్లూ వుండనే వున్నాయి. కాని పిల్లల దృష్టి మళ్లుతుందేమో అని ఏదో కొత్తరకం వాటిని చూపినట్లంది.

"ఏం అత్తా, ఆ యింకో పొలంలో గడ్డి ఎందుచేత యిక్కడికంటె బాగుంటుంది?" అమ్మాయి అడిగింది యీ మాటు.

మూలని కూర్చున్న బ్రహ్మచారి ముఖంపై ముడుతలు బాగా ఏర్పడుతున్నాయి. అతను కొంచం విపరీత వ్యక్తిలా వున్నాడు అనుకుంది ఆవిడ. ఎంత ప్రయత్నించినా ఆ పొలంలో గడ్డి ఎందుకు బాగుంటుందో నిర్ణయించలేకపోయింది. చిన్నపిల్ల ఏదో ఆనందంకొద్దీ పాడ్డం ప్రారంభించింది. రైలుపెట్టె అంతా ఆమె పాటతో నిండిపోయి యింకేయితర ధ్వనులూ వినిపించడం మానేశాయి.

"ఇలా కూర్చోండి. మంచి కథ చెపుతా" అంది ఆవిడ. ఎందుకంటే, వారి గోల భరించలేనన్నట్లు ఆవిడకేసి రెండుసార్లూ, రైలునాపే గొలుసు కేసి ఒకసారీ, చూచాడు బ్రహ్మచారి—ఫలితం బాగానేవుంది. పిల్లలు హడావిడిగా ఆమెచుట్టూ చేరారు. వారి దృష్టిలో ఆవిడ కథలు బాగా చెప్తుందేమో. ఆవిడ చెప్పడం మొదలెట్టింది—కథ. మధ్యమధ్య పిల్లలు ప్రశ్నల మూలాన్నీ, వాటిసమాధానాలవల్లా అక్కడక్కడ తెగినా అది ఓ మంచి అమ్మాయినిగురించి. ఆ

కె. రామలక్ష్మి

అమ్మాయి చాలా మంచిదిట. అందుకే అందరూ ఆ అమ్మాయి స్నేహం చేసేవారట. ఓ మదించిన ఆంబోతు ఆ అమ్మాయిని తరిమితే, ఆవిడంటే ఇష్టమైనవాళ్ళంతా దాన్ని తరిమేసి, ఆ అమ్మాయిని రక్షించారట.

"ఆ అమ్మాయి మంచిది కాకపోతే వాళ్లు రక్షించేవారు కారా అత్తా" అంది పిల్ల. సరిగ్గా అదే ప్రశ్న ఆ బ్రహ్మచారికికూడా వెయ్యాలనితోచింది.

"ఎందుకు రక్షించరు! రక్షించేవారు లే" విచారంగా అంది అత్త "అంత త్వరితంగా అందరూ పరిగెత్తేవారు కాదేమో, ఆ అమ్మాయి మంచిది కాకపోతే". "ఇంత వెధవకథ ఎక్కడా వినలేదు." ఇద్దరు చిన్నపిల్లల్లోకి పెద్దది అంది.

"మొదలు విన్నాక నేనింక వినేలేదు. అసహ్యము వేసింది" అన్నాడు పిల్లాడు. అందరిలోకీ చిన్నపిల్లకి ఏం అండానికీ తెలియలేదు. కాని ఎప్పుడో లోపల్లోపల యిందాకా పాడిన పాట గొణుక్కోడం మొదలెట్టింది.

"కథలు చెప్పడంలో మీకు ప్రావీణ్యం లేనట్టుంది" అన్నాడు బ్రహ్మచారి హఠాత్తుగా.

ఈమాటకి ఆవిడ చాలా ఆశ్చర్యపోయింది!

"పిల్లలికి అర్థంఅయి ఆనందించే కథలు చెప్పడము చాలా కష్టం" అంది.

"నేనలా అనుకోను" అన్నాడు బ్రహ్మచారి.

"అయితే మీరోకథ చెప్పకూడదూ వాళ్ళకి" అంది అత్త ఎలాగా గెలవలేడనే ధీమాతో.

"అనగా అనగా ఒకవూళ్ళో లక్ష్మిఅనే ఓ మంచి అమ్మాయి వుండేది. ఆ అమ్మాయి చాలా మంచిది సుమండీ." అని కథ చెప్పడం మొదలెట్టాడు. పిల్లలు కొంచెం సంశయించారు. ఎవరు చెప్పినా అన్నికథలూ వారిదృష్టికి ఓలాగే కనిపిస్తున్నాయి-"ఏంచెప్తే అదిచేసేది. ఎప్పుడూ నిజం మాట్లాడేది. శుభ్రంగావుండి ఎప్పుడూ పాఠాలు బాగా చదువుకునేది. పెద్దల్ని గౌరవంగాకూడా చూచేది."

"అందంగా వుండేదా" కొంచెం పెద్దపిల్ల ప్రశ్న.

"నీఅంత అందంగావుండేది కాదనుకో, కాని చాలామంచిది" అన్నాడు బ్రహ్మచారి. పిల్లల్లో ఏదో కదిలింది. కథ మంచి రసవంతంగా వుండేలా తోచింది. "దారుణంగా మంచిది. అందుకే స్కూల్లో ఎన్నో ప్రైజులు ఇచ్చాయి. చెప్పిన మాట విన్నందు కొకమెడలూ, సరిగా టైము కొచ్చినందు కొకటి, బాగా నడుచుకొన్నందు కొకటీ, ఎన్నో అందుకే అందరికీ తెలిసింది. ఆమె మంచితనాన్ని గురించి."

"దారుణంగా మంచిది!" తిప్పి అన్నాడు పిల్లాడు.

"అందరూ ఆ అమ్మాయినిగురించే మాట్లాడేవారు, ఆ దేశపు రాజకుమారుడికికూడా తెలిసింది యీ అమ్మాయినిగురించి ఆమె మంచితనానికిబహుమానంగా, ఆమె వారానికోరోజు తన ఉద్యానవనంలో తిరగడానికి ఆమెకి అనుజ్ఞ యిచ్చాడు. రాజకుమారుని ఉద్యానవనం చాలా చక్కనిది. పిల్లల్ని వెళ్ళనిచ్చేవారుకాదు. అందుకే లక్ష్మికి గొప్ప సన్మానం జరిగిందనుకున్నారు అందరూ"

"ఎప్పుడేనా మేకలువెళ్ళేవా?" వేశాడు ప్రశ్న పిల్లాడు.

"లేదు- వెళ్ళనిచ్చేవారే కాదు."

"ఏంచేత?" ఆ యిచ్చిన సమాధానంమీద యీ ప్రశ్న.

"ఏంచేతంటావా? రాకుమారుని తల్లికి కల వచ్చింది ఓరోజు. ఒక మేకవల్లకాని, లేకుంటే గడియారం తలపై పడ్డంవల్ల కాని, రాకుమారుడు మరణిస్తాడని ఆ కలవల్ల తెలిసింది. అందుకే రాజభవనంలో గడియారాలూ లేవు. రాజోద్యానవనంలో మేకలూ వుండవు" అన్నాడు బ్రహ్మచారి.

"ఆ రాకుమారుడు చచ్చిపోయాడా?" ప్రశ్నించాడు పిల్లాడు.

"ఇంకా బతికేవున్నాడు. కలనిజమౌతుందో లేదో చెప్పలేం" అన్నాడు బ్రహ్మచారి...

"సరేకాని ఆ తోటలో మేకల్లేవు. కాని యెన్నో పందేళ్లు పరుగులెడుతుంటాయి"

"ఏరంగు పందేళ్లు?" పెద్దపిల్లప్రశ్న.

"నల్లవాటికి తెల్లముఖాలుంటాయి. తెల్లవాటికి నల్లమచ్చ లుంటాయి; కొన్నింటికి బూడిదరంగులో తెల్లమచ్చలు-కొన్ని అంతా తెల్లవీ—

కొంచం ఆగాడు బ్రహ్మచారి. "లక్ష్మికి చాలా బాధేసింది. పువ్వులు కొయ్యకూడదంటే మంచిపిల్లకనక దొంగతనంగా కొయ్యకూడదనుకుంది. కాని పువ్వులే లేవు ఆ తోటలో"

"నిజంగానేనా! ఒక్కడ పువ్వులే లేవూ?"

"కుందేళ్లు అన్నీ తెంపి కొరికి పాడిచేసేసాయి. తోటమాలి రాకుమారుడికి చెప్పాడు. 'కుందేళ్ళేనా వుండాలి, పువ్వులేనా వుండాలి' అని. రాకుమారుడు కుందేళ్ళనే వుంచమన్నాడు. అందుకే పువ్వులే లేవు." రాకుమారుని ఆజ్ఞకి సంతృప్తికలిగింది పిల్లలకి. చాలామంది మనుషులు దానికి తల్లక్రిందులు చేసేవారేమో!

"ఆ తోటలో యింకా చాలా చక్కటి వింతలున్నాయి. లక్ష్మితోటలో పచారుచేస్తోంది. సాయంత్రం అవుతోందికదూ అంచేత మంచి కుందేలేదేనా దొరుకుతుందేమో అని ఓ పెద్ద తోడేలు వచ్చింది.

"ఏరంగులో వుంది?" చాలా ఆత్రంగా వచ్చింది ప్రశ్న.

"బూడిదరంగులో వుంది. నల్లటి నాలిక—బూడిదరంగు కళ్ళు భయంకరంగా మెరుస్తున్నాయి—దాని కళ్ళయెదట పడ్డది లక్ష్మి. లక్ష్మిదాన్ని చూసింది. అది ఆమెకేసే వస్తోంది. తోటలోకి రాకుండావుంటే బాగుండుననుకుంది. ఇంక ఆలోచనకి వ్యవధిలేక పరుగు లంకించుకుంది. కాని ఆ తోడేలుకూడా పరుగెత్తింది—లక్ష్మి ఓ పొదలో దాక్కుంది. నేయింత మంచిగా వుండకపోతే యీపాటికి హాయిగా యింట్లోవుండేదాన్ని కదా" అని విచారించింది. ఆ పొదచుట్టూ తిరిగినా లక్ష్మి కనిపించలేదు. అందుకే అనవసర శ్రమ అనుకుని కుందేలుకోసం పోయింది తోడేలు. లక్ష్మి హడావిడికొద్దీ బైటకి వచ్చింది. యింతట్లో తోడేలు వెనుతిరిగి లక్ష్మిని పట్టేసుకుంది. పాపం! మిగిలిందల్లా ఆమె ధరించిన జోళ్ళూ, చిన్న చిన్న గుడ్డపేలికలూ, ఆమె మంచితనానికి సంపాదించిన ప్రైజులూను.

"ఏకుందేలైనా చచ్చిపోయిందా?"

"లేదు- అవన్నీ తప్పించుకు పారిపోయాయి"

"మొదలు బాగుండక పోయినా చివరికి చాలా బాగుంది కథ" అంది కొంచెం పెద్దపిల్ల.

"ఇంత మంచికథ ఎక్కడా వినలేదు" అన్నాడు పిల్లాడు.

"ఇదొక్కటే యింతమంచికథ!" అంది పిల్ల మళ్ళీ.

మూలకూర్చున్న అత్తకి అలాతోచలేదు.

"చిన్నపిల్లకి చెప్పవలసిన కథ కానేకాదు" అంది! "సంవత్సరాలుగా నేర్పిన మంచితనం అంతా మరచి పోయారు!" అంది అత్త.

ఏదెలావున్నా తనపెట్టెబేడా సర్దుకుంటూ బ్రహ్మచారి అన్నాడు. "పదినిమిషాలు అల్లరి లేకుండా కూర్చోపెట్ట గలిగాను. మీకంటె చాలానయం కదూ!"

"పాపం!" అనుకున్నాడు రైలుపెట్టెలోంచి దిగిపోతూ బ్రహ్మచారి. "ఇంకో ఆరునెల్లదాకా యిలాంటి కథలకోసం ఆవిణ్ణి వేపుకుతింటూరు-"

---

స్కెచ్

# 'ఏంచేసినా ఒకటే'

"శ్రీవిరించి"

"ఇంటికెళ్లి యేంచెయ్యను?" అనుకున్నాడు రంగారావు. కాని యింటికి వెళ్ళకుండా చెయ్యగల ప్రయోజనకరమైన పనిలేదు.

రంగారావే కాదు, సాధారణంగా మనలో చాలామందికి అడపాతడపా యిట్లాంటి ప్రశ్నే వుదయిస్తూంటుంది. అయితే దానికి తకిమని సమాధానం యేమీ దొరక్కపోయినా దగ్గరలో వున్న యే పార్కుకో వెళ్లి వొంటరిగా బెంచీ మీద కూలబడతాము. రంగారావుమాత్రం అంత కన్నా యెక్కువేం చెయ్యగలడు?

—రేడియో సంగీతం పాడుతోంది. పక్షులు కిలకిలలాడుతూ పార్కులో చెట్లమీదికి చేరుకుంటున్నాయి. ఆకాశం నిర్మలంగాలేదు, ఏ అర్థరాత్రికో పైరులు పాడుచెయ్యగల వాన రావచ్చు. మొత్తంమీద వాతావరణం ప్రోత్సాహజనకంగా లేదు. సంగీతం ఆగిపోయింది.

చేతిలో తలవాల్చుకుని వున్నవాడల్లా రంగారావు హటాత్తుగా సంగీత కెరటాలు ఆగిపోయిన వేపు చూచాడు. ఏమిటీ తమాషా! తన మనస్సు యింత సేపూ సంగీతం వింటోందా? తన దృష్ట